ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు రెండో రోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. శనివారం అండర్-14, 17 బాలికల ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు జరిగాయి. జిల్లాలో 27 మండలాల్లో పోటీలు ప్రశాంతంగా జరిగాయని ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి తెలిపారు. విజేతలు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అస్మదీయులకే సహకారం

సంతకవిటి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి, అస్మదీయులను నెత్తిన పెట్టుకోవడమే అందుకు కారణం. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. పిఎసిఎస్ చైర్మన్, సిఇఒ నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారనే విమర్శలు సర్వత్రా రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

- రైతులను పట్టించుకోని పిఎసిఎస్?
- చైర్మన్, సిఇఒలపై విమర్శల వర్షం
- కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించాలని అన్నదాతల విన్నపం

ప్రజాశక్తి - సంతకవిటి

ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు సంతకవిటి పిఎసిఎస్‌కు 1344 యూరియా బస్తాలు వచ్చాయి. వాటి పంపిణీపై ఎటువంటి స్పష్టత లేకపోవడం అన్నదాతల్లో ఆగ్రహం రేపింది. యూరియా కోసం రైతులు.. రైతు సేవా కేంద్రాలు, ప్రయివేట్ ఎరువుల దుకాణాల వద్ద బారులు తీరడం నిత్యం కనిపించింది. అలాంటి తరుణంలో పిఎసిఎస్ వద్ద మాత్రం ఎవరికీ సమాచారం ఇవ్వకుండానే పంపిణీ జరిగిందంటూ రైతులు మండిపడుతున్నారు. యూరియా అంతా ఇచ్చేశామని చెప్పి చైర్మన్, సిఇఒ బాధ్యత నుంచి తప్పించుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో యూరియా అంశంపై ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు మండల వ్యవసాయ అధికారిని నిలదీశారు. అధికార పార్టీ నాయకుల వద్దకే యూరియా బస్తాలు చేరి, కూటమి కార్యకర్తలు అధిక ధరలకు అమ్ముకున్నారని సభ్యులు మండిపడ్డారు. ఈ సమావేశానికి టిడిపి కూటమి ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది.

మండలంలోని రైతులకు పిఎసిఎస్ ద్వారా రూ.25 కోట్ల రుణాలు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. చెరకు ఎకరానికి రూ.70 వేలు, వరి ఎకరాకు రూ.48 వేల చొప్పున రుణాలు ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే ఈ రుణాలు కూడా సక్రమంగా రైతులకు అందలేదని, కొందరు వరి వేసి చెరకు సాగుచేసినట్లు రుణం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చైర్మన్, సిఇఒ తమ బాధ్యతలను విస్మరిస్తూ, రాజకీయ ప్రభావంతో వ్యవహరిస్తున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. పిఎసిఎస్ అధికారుల పనితీరుపై రైతులు అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని విచారణ జరిపించాలని కోరుతున్నారు. రైతుల సమస్యలపై చైర్మన్ నిర్లక్ష్యం కారణంగానే పిఎసిఎస్‌లో అవస్థలు పెరిగాయని అన్నదాతలు ఆరోపిస్తూ, తక్షణమే ఎమ్మెల్యే స్పందించి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో ఎఒను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

అన్నీ సిఇఒ చూసుకుంటారు

పిఎసిఎస్‌లో యూరియా, రుణాల పంపిణీ విషయమై చైర్మన్ చెలికాని మహేష్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా, 'అన్నీ సిఇఒ రమణ చూసుకుంటారు. నాకు వివరాలు తెలియవు' అంటూ సమాధానం చెప్పడం గమనార్హం.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆయిల్‌పామ్ సాగు అన్ని పంటల కన్నా లాభదాయకమని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. విజయనగరం రూరల్ మండలంలోని కొండకరకాంలో సాగవుతున్న ఆయిల్ పామ్ తోటను శనివారం కలెక్టర్ సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ, బిందు సేద్యం వల్ల లాభాలు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 6,612.5 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగవుతుందని చెప్పారు. 2025-26 సంవత్సరానికి 26 మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా గుర్తించామని, 4625 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా రైతుకు వంద శాతం రాయితీతో ఆయిల్ పామ్ మొక్కలు అందిస్తారని, జిల్లాలో ఏడు ఆయిల్ పామ్ తయారీ కంపెనీలు ఉన్నాయని తెలిపారు. బిందు సేద్యం పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితో డ్రిప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి చిట్టిబాబు, విజయనగరం రూరల్ ఉద్యాన అధికారి జ్యోత్స్నరాణి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

వైసిపి జిల్లా కార్యాలయాన్ని పరిశీలించిన బొత్స

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని రింగ్‌రోడ్‌లో నిర్మాణ దశలో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయాన్ని శనివారం శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సందర్శించారు. కార్యాలయ నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల కోర్టు తీర్పు సానుకూలంగా రావడంతో తిరిగి నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వైసిపి నాయకులు పరిశీలించారు. నిర్మాణ సంస్థ సిబ్బందితో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

నిర్మాణంలో ఉన్న కార్యాలయాన్ని పరిశీలిస్తున్న బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు

పర్యావరణ హితంగా దీపావళి

మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా ప్రజలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకునే దీపావళి.. వెలుగు, సంతోషం, ఐక్యత, ఆనందం నింపే పండుగని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వెలుగు, ఆనందం, సుఖశాంతులు నిండాలని ఆకాంక్షించారు. పటాకులు భద్రతగా, పర్యావరణ హితంగా పేల్చి పండుగను జరుపుకోవాలని కోరారు.

దేశ సంస్కృతిలో ప్రత్యేక స్థానం

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

కంటోన్మెంట్ : దీపావళి వెలుగుల పండుగగా, చెడుపై మంచి విజయాన్ని ప్రతిబింబించే మహోత్సవంగా మన దేశ సంస్కృతిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దీపావళి ప్రతి కుటుంబానికి కొత్త ఆశలు, వెలుగులు, విజయాలు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు.

20న గ్రీవెన్స్ రద్దు

కంటోన్మెంట్ : ఈ నెల 20వ తేదీన దీపావళి పండగ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ప్రకటించారు. తదుపరి వారం నుంచి పిజిఆర్ఎస్ యథావిధిగా జరుగుతుందని తెలిపారు. ఈ వారం పిజిఆర్ఎస్ రద్దు విషయాన్ని ఫిర్యాదు దారులు గమనించి, వ్యయ ప్రయాసలకు ఓర్చి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

బాణసంచా విక్రయదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి దామోదర్

బాణసంచా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని కెఎల్‌పురం శివార్లలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయించే షాపులను ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల నియంత్రణకు బాణసంచా విక్రయదారులకు పలు భద్రతపరమైన సూచనలు చేశారు. గడువు ముగిసిన తరువాత బాణసంచా విక్రయాలను నిలిపివేయాలని, మిగిలిన సామగ్రిని సురక్షితమైన గోడౌన్లలో భద్రపర్చుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాల రాకపోకలకు విఘాతం కలగకుండా చూడాలని ట్రాఫిక్ సిఐను ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఇన్‌ఛార్జి డిఎస్‌పి గోవిందరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కె.చౌదరి, టూ టౌన్ సిఐ టి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ సూరినాయుడు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి జూనియర్ తైక్వాండో పోటీలు

విజయనగరంటౌన్ : నగరంలోని విజ్జీ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి జూనియర్, క్యాడెట్ తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.వి.చారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 24, 25వ తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. బాలబాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 7793950599 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

నగరంలోని కొత్త అగ్రహారం వాటర్ ట్యాంకు వద్ద పంపింగ్ వాల్వ్ మరమ్మతులకు గురి కావడంతో శని, ఆదివారాల్లో తాగునీటి పంపిణీకి అంతరాయం ఏర్పడిందని కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు చేపడుతున్నామని, పూర్తయిన తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. లంకా పట్నం, నాగవంశం వీధి, పుచ్చలవీధి, హుకుంపేట, బంగారమ్మ కాలనీ, బందపాలెం, బూర్లెపేట, దక్కిన వీధి, వైష్ణవ వీధి, ఉల్లి వీధి, కొత్త అగ్రహారం-1,2,3,4 లైన్లలో నీటి పంపిణీకి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

విఒఎ చేతివాటం

- పొదుపు సంఘాల నిధులు దుర్వినియోగం
- రూ.15 లక్షల వరకు స్వాహా
- ఒకే వ్యక్తికి సిఎఫ్, బ్యాంకు మిత్ర పోస్టులు
- రికవరీ చేయాలని ఎస్‌హెచ్‌జిల డిమాండ్

ప్రజాశక్తి-రేగిడి

గ్రామస్థాయి మహిళా పొదుపు సంఘాల బలోపేతానికి డిఆర్‌డిఎ వెలుగు సిఎఫ్‌లు (విఒఎ) ఎంతో కీలకం. ఆ విఒఎలు పొదుపు సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, తిరిగి బ్యాంకులకు కట్టే విధంగా చర్యలు తీసుకునేలా పనిచేయాలి. కానీ ఆ విఒఎ పొదుపు సంఘాల నుంచి లక్షలు సొమ్మును స్వాహా చేసి చేతివాటం ప్రదర్శించారు. దీంతో పొదుపు మహిళలంతా ఇలాంటి సిఎఫ్ మాకొద్దు అంటూ మూకుమ్మడిగా తీర్మానం చేసారు.

రేగిడి మండలం అంబాడ గ్రామపంచాయతీ విఒఎగా పనిచేస్తున్న వానపల్లి నిర్మల బ్యాంకు రుణాలు కట్టేందుకు మహిళల నుంచి డబ్బులు వసూలు చేసి తినేశారని గ్రామైక్య సంఘాల మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.. బ్యాంకులకు రుణాలు కట్టాలని నగదు తీసుకొని సొంతానికి వినియోగించుకుని బ్యాంకులకు కట్టడం లేదని వాపోతున్నారు. ఇలా కొన్ని సంవత్సరాలు చేయడం పట్ల బ్యాంక్ బకాయిలు ఎక్కువగా పేరుకు పోయాయని పొదుపు సంఘాల సభ్యులు అంటున్నారు. ఇలా వసూలు చేసిన సుమారు రూ.15లక్షలు వరకు నిధులు చేతివాటం ప్రదర్శించి నిధులు దుర్వినియోగం చేశారని పాలధార పార్వతి తెలిపారు. ఆమె విఒఎతో పాటు బ్యాంకు మిత్రగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. లబ్ధిదారుని వద్ద వేలిముద్ర వేసి ముద్ర పడలేదని చెప్పి ఉపాధి కూలీలకు, మహిళా సంఘాల సభ్యులకు, బ్యాంకు లబ్ధిదారులకు, మోసం చేసి నగదు స్వాహా చేస్తున్నారని, మరికొన్ని సందర్భాల్లో వేలు ముద్రలు వేసిన అనంతరం సర్వర్ పని చేయలేదని నగదు దోచుకుంటున్నారని జమ్మన గౌరీశ్వరి, దుప్పాడ రేవతి తో పాటు గ్రామపంచాయతీ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు ఆరోపించారు.. వానపల్లి నిర్మలపై ఉణుకూరు గ్రామీణ బ్యాంకు మేనేజర్, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, ఎపిఎం గోవిందరావుకు ఇప్పటికే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వెలుగు కార్యాలయం

పూర్తిస్థాయిలో విచారణచేపట్టి రికవరీ చేస్తాం

విఒఎ వానపల్లి నిర్మల చేతివాటం ప్రదర్శించి, నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.. వెలుగు విఒఎ గా, బ్యాంకు భీమా మిత్రగా రెండు పోస్టులు చేయడం వాస్తవం.. విచారణ చేపట్టి నిధులు రికవరీ చేస్తాం.

- గోవిందరావు, ఎపిఎం

కోళ్లఫారం యజమానికి నోటీసులు

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలో పాతబగ్గాం, భూదేవి పేట, బంగారమ్మపేట గ్రామాలకు సమీపంలో ఉన్న కోళ్ల ఫారం నిర్వహణపై గురువారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన దుర్వాసన, పంటలు నాశనం కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఎంపిడిఒ బి.కళ్యాణి ఆదేశాల మేరకు పాతబగ్గాం పంచాయతీ కార్యదర్శి రెడ్డి అప్పారావు కోళ్ల ఫారం యజమానికి నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బంగారంపేట పంచాయతీ సెక్రెటరీ రామనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లఫారం యజమానికి నోటీసులు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి రామనాథ్

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

వాహన కాలుష్యం తగ్గించాలి

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వాహన కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా స్వచ్ఛమైన గాలి పొందగలమని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మూడో శనివారం 'స్వచ్ఛమైన గాలి' అనే అంశంతో నగరంలోని పెద్దచెరువు గట్టున ఉన్న గాంధీ విగ్రహం వద్ద నగరపాలక సంస్థ చేపట్టిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నగరపాలక సంస్థలో ఉత్తమ సేవలు అందించిన 12 మంది పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు విరివిగా నాటి, వాటి సంరక్షణ భాద్యత తీసుకోవాలని కోరారు. అనంతరం గాంధీ విగ్రహ ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా అధికారులు, రాజకీయ ప్రతినిధులు, పాత్రికేయులు, పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ దగ్గరుండి మొక్కలు నాటించారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ విజయనగరం అనే నినాదంతో ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, జిల్లా కాలుష్య నియంత్రణాధికారిని సరిత, ఐసిడిఎస్ పీడీ విమలా రాణి, మెప్మా పీడీ చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘోషాలో ఘనంగా బాలికల దినోత్సవం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఘోషా ఆసుపత్రిలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.జీవన్ రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని సేవ్ ది గర్ల్ చైల్డ్ పేరుతో ఈ నెల 12 నుంచి 18వ తేది వరకు వారం రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించారు. అందులో లింగ వివక్షతపై రోజువారీగా ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు, ఇందులో భాగంగా శనివారం ఘోషా ఆసుపత్రిలో రెండో బాలికకు జన్మనిచ్చిన బాలింతలకు డిఎంహెచ్ఒ.. లింగ వివక్షతపై, లింగ సమానత్వం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్త్రీవైద్య నిపుణులు సుధ, డెమో వి.చిన్నతల్లి, మార్నింగ్ కన్సల్టెంట్ పవన్ ఆశిష్ కుమార్ పాల్గొన్నారు.

బాలింతతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జీవన్‌రాణి

విద్యార్థులను అభినందిస్తున్న సత్య విద్యాసంస్థల డైరెక్టర్ శశిభూషణరావు

కబడ్డీలో 'సత్య' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల జరిగిన ఆంధ్రా విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌లో సత్య డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థులు నలుగురు సత్తాచాటి, యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. శ్రీవల్లి, రమ్య, నీలిమ, వరలక్ష్మి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌లో ఎయు తరపున పాల్గొననున్నారు. జూడో ఛాంపియన్‌షిప్‌కు హేమంత్ ఎంపిక అయ్యాడు. వీరిని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శశి భూషణరావు, ప్రిన్సిపల్ ఎం.వి సాయిదేవమణి, పీడీ ఎస్.హెచ్.హెచ్ ప్రసాద్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి.సూరపనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని వైద్య కళాశాలగా మార్చాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని వైద్య కళాశాలగా మార్చాలని ఉత్తరాంధ్ర అంబేద్కర్ రైట్స్ నాయకులు పాండ్రింకి వెంకటరమణ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జి.మాధవన్‌కు వినతి అందించారు. విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ఫ్రెషర్స్‌డేకు హాజరైన ఆయన్ను కలిసి సమస్యను వివరించారు. అధిక రోగులకు మౌలిక వసతులు లేక పూర్తిస్థాయిలో సేవలు అందించలేని ప్రభుత్వ ఆసుపత్రిని మెడికల్ కాలేజీకి తక్షణమే మార్చాలని విజ్ఞప్తిచేశారు.

'జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కుల గణన చేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణలో బిసి రిజర్వేషన్ బంద్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు చోడి ఆదినారాయణ, రొంగలి రామారావు, న్యాయవాది కరీం, బోరా ఐశ్వర్య యాదవ్, ఇప్పిలి రామారావు మాట్లాడారు. చట్ట సభల్లో ప్రాతినిధ్యం లేని కారణంగా కొన్ని సామాజిక తరగతుల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల కోసం మాట్లాడే నాయకులు లేక సమాజంలో చాలా వెనుకబడి ఉన్నారని తెలిపారు. సమ సమాజం కావాలన్నా, అందరూ సమానాభివృద్ధి చెందాలన్నా రాజ్యాధికారంలో ప్రజలందరికీ రాజకీయ వాటా దక్కాలని అభిప్రాయ పడ్డారు. బిసి రిజర్వేషన్ బిల్లుకు దేశంలోని ప్రజాప్రతినిధులంతా చట్టసభల్లో మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దిమిలి పైడిరాజు, గండ్రేటి శ్రీను, పి.షణ్ముఖరావు, కుందేటి పార్వతి, పి.మీనాక్షి, ఎం.చిట్టితల్లి, కిలంపల్లి ఆచారి, నక్క సూర్యనారాయణ, దున్న రాంబాబు, ఎస్.ఆదిలక్ష్మి, కొల్లేటి శ్రీను, ఎస్.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంతకీ ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంతకీ ఎంత? వచ్చిందెంత? ఇచ్చిందెంత? మిగిలిందెంత? ఇదీ ఉత్సవాల పేరిట నిధుల సమీకరణ, ఖర్చు జమలపై ఉమ్మడి విజయనగరం జిల్లాలో సర్వత్రా సాగుతున్న పబ్లిక్ టాక్. ఈ నెల 5, 6వ తేదీల్లో విజయనగరం ఉత్సవాలు జరిగాయి. ఘనంగా నిర్వహించామంటూ అధికారులు, అధికార పార్టీ నేతలు చెప్పుకుంటుంటే, ఈసారి ఉత్సవాల నిర్వహణ అధ్వానంగా ఉందంటూ ప్రధాన ప్రతిపక్షం వైసిపి నుంచి విమర్శలు వినిపించాయి. నిర్వహణలో లోటుపాట్లు, వైఫల్యాల సంగతి అటుంచితే... ఉత్సవాల్లో జనం ఎప్పటి మాదిరిగానే భాగస్వామ్యం అయ్యారనేది వాస్తవమే. అంతమాత్రాన చంకలు గుద్దుకోవడానికి వీల్లేదు సుమా...! కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తదితరాలపై ప్రజలకున్న మక్కువ అది. అందుకే ఎన్ని లోటుపాట్లు ఉన్నా జనం ఉత్సవాల్లో భాగస్వామ్యమౌతూ వస్తున్నారు. ముఖ్యంగా కళాకారులకు ప్రోత్సాహకాలు ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రదర్శనలకు పోటీ పడుతుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని, ఉత్తి పుణ్యానికి ప్రదర్శన అవకాశాలు కల్పించిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఇటువంటి వైఫల్యాలు నిరంతరం సాగుతున్నవే. కానీ, ఈసారి ఉత్సవ నిధుల సేకరణ సంప్రదాయానికి మించిన రీతిలో సాగినట్టుగా విమర్శలు ఉన్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. గతంలో పరిమితమైన వారి నుంచి నిధులు సేకరించేవారు. ఈసారి కాస్త ఎక్కువ మంది నుంచి సేకరించారని బోగట్టా. దీనికితోడు అధికారులు దాతలను కలిస్తే... ఆ దాతలు వారి దిగువున్న ఉన్నవారిపై పడ్డారట. దీంతో, కింది స్థాయి వరకు వెళ్లిపోయింది. ఇటువంటి పరిస్థితి మునుపెన్నడూ లేదనే వాదన వినిపిస్తోంది. ఉత్సవాల పేరిట దండేసుకున్నారంటూ వైసిపి నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మరింత సూటిగా విమర్శలు చేశారు. ఆ తరువాత రోజే జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉన్నంతలో వచ్చిన నిధులపై కొంత క్లారిటీ ఇచ్చారు. కానీ, అది ప్రాథమిక అంచనా మాత్రమే. దీనిపై ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. వాస్తవానికి ఈ నిధులు సేకరించింది అధికారులే. లెక్కలన్నీ వారి వద్దే ఉన్నాయి. వివిధ వేదికలు, ఇతర ఖర్చులకు కేటాయించిన ఖర్చులు కూడా వారే చూసుకున్నారు. మునుపెన్నడూ లేనంతగా విమర్శలు వస్తున్నప్పటికీ ఇప్పటికీ నిర్దిష్టమైన లెక్కలు చూపించక పోవడంతో పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉత్సవాలు ముగిసి పది రోజులు దాటుతున్నా ఇప్పటికీ అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోందనే చర్చ ముమ్మరంగా సాగుతోంది. ఒక్క లేజర్ షోకి రూ.20 లక్షలు వెచ్చించారట! అంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు. రాజుల రాజసం తెలియజేయడానికి ఇంత మొత్తంలో ఖర్చా? అంటూ చర్చ నడుస్తోంది. అందుకే ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మొత్తం ఎంత ఖర్చయింది? ఎవరి నుంచి ఎంత విరాళం అందింది? ఆ నిధులు ఎలా వినియోగించారు? మిగిలిన మొత్తం ఎంత? అనేది స్పష్టం చేస్తుందా? లేదా? అనే ఆసక్తికర పబ్లిక్ టాక్ ఉమ్మడి విజయనగరం జిల్లాలో నడుస్తోంది.



బాణసంచా షాపులకు స్థల పరిశీలన

బొబ్బిలి: పట్టణంలో బాణాసంచా షాపులు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని శనివారం ఆర్‌డిఒ జెవిఎ రామ్మోహనరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు షాపులు కోసం దరఖాస్తులు వచ్చాయని, స్థలాన్ని, సౌకర్యాలను పరిశీలించి లైసెన్స్ ఇస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి షాపులు పెట్టాలని కోరారు. అగ్నిప్రమాద నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో తహశీల్దార్ ఎం. శ్రీను ఉన్నారు.

'సోలార్'ను సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి: సోలార్‌ను విద్యుత్తును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ టిడిఆర్‌ఒ జగన్మోహనరావు, ఎంపిడిఒ పి.రవికుమార్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం పిఎం సూర్యఘర్ సోలార్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బిల్లును ఆదా చేసుకునేందుకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకుని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చన్నారు. సోలార్‌కు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ, రుణాలు ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గౌతమ్‌రెడ్డిని కలిసిన దవళ

నెల్లిమర్ల: వైసిపి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పునూరు గౌతంరెడ్డిని ఇటీవల రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన దవళ లక్ష్మణరావు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడ వైసిపి కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో దవళ లక్ష్మణరావు కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడూ తగిన ప్రాధాన్యత ఉంటుందని కార్మిక విభాగం ఏర్పడినప్పటి నుంచి యూనియన్ అభివృద్ధికి లక్ష్మణరావు చేసిన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకులు రెడ్డి రాంబాబు, వైసిపి లీగల్‌సెల్ నాయకులు బలగం లక్ష్మణరావు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

డెంకాడ: 104 ద్వారా మెరుగైన సేవలను అందించాలని ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సాయిరామ్ అండ్ జిల్లా ఇంచార్జ్ మేనేజర్ నరసింహమూర్తి సిబ్బందికి సూచించారు. మండలంలోని మోపాడ పిహెచ్‌సి పరిధిలో ఉన్న జొన్నాడ పంచాయతీ దువ్వపేట గ్రామంలో శనివారం 104లోని మందులు, రికార్డులు, పరికరాలు పరిశీలించారు. ఏఏజు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు, రోజుకు ఎంత మందికి వైద్య ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారన్న విషయాలను ఆరా తీశారు. ఈ కార్యాలయంలో డిఇఒ సంతోష్ డ్రైవర్ మధు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయాలి

వేపాడ: పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ప్రజల పక్షాన వార్తలు ప్రచురిస్తున్న పత్రికలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని జర్నలిస్టులు కోరారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపైన, జర్నలిస్టులపైన పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ శనివారం ఉప తహశీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విలేకర్లు పాల్గొన్నారు.

వసతిగృహంలో ఉద్యానవనం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో వివిధ రకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలను శనివారం నాటారు. వసతి గృహం ప్రిన్సిపల్ జయశ్రీ, గణిత టీచర్ లక్ష్మి, ఇంఛార్జ్ ప్రిన్సిపల్ వసతి గృహం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జంగిల్ తొలగింపు

నెల్లిమర్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్ఐ ఆధ్వర్యంలో యువత శనివారం డైట్ కాలనీ రోడ్డు పక్కన, మలుపుల వద్ద పిచ్చిమొక్కలను తొలగించారు. గురుకుల పాఠశాల జంక్షన్ నుంచి ఫ్లైఓవర్ అండర్ బ్రిడ్జ్ జంక్షన్ వరకు ఉన్న పిచ్చి మొక్కలను, జంగిల్‌ను క్లియర్ చేశారు.

డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీ

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిఎంహెచ్‌ఒ జీవనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు.

రైతులు ఇ-క్రాప్ చేయించుకోవాలి

నెల్లిమర్ల: రైతులు పంటలకు తప్పనిసరిగా ఇ-క్రాప్ చేయించుకోవాలని ఎడిఎ ఎన్.కోటేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఎఇఒలు, విఎఎలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అన్ని రకాల పంటలకు ఇ-క్రాప్ నమోదు తప్పనిసరన్నారు. ఇ- క్రాప్ నమోదుపై రైతులకు మరింత అవగాహన కల్పించి అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ డేటా బుకింగ్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపల్ భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాకు 286 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో పలు కంపెనీలకు 142 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, మరొక 21 మంది తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఈ జాబ్ మేళాకు 10 బహుళ జాతి కంపెనీలు పాల్గొన్నాయని ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10వేలు, రూ.35వేల వరకు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆదిత్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఉద్యోగి మృతి

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఉద్యోగి పత్తికాయల అప్పారావు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. పిఎసిఎస్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న అప్పారావు 30 సంవత్సరాలుగా పైగా సేవలందించారు. ఆయన మృతికి డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ చంద్రమోహన్, అసిస్టెంట్ మేనేజర్ క్రాంతి కుమార్ సంతాపం తెలిపారు. అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో రైలు నుంచి జారిపడి బట్టిగూడ గ్రామం పాచిపెంట జిల్లాకు చెందిన ఓం ప్రకాష్ యాదవ్ మృతి చెందినట్లు రైల్వే కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు చెప్పారు. పలాస నుంచి గుర్తుతెలియని రైలులో ప్రయాణం చేస్తూ ఓం ప్రకాష్ ప్రమాదవశాత్తు జారిపడి మరణించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన విక్రమ్ దంపతులు

విజయనగరం టౌన్: కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్‌ను జనసేన నాయకులు అవనాపు విక్రమ్, డాక్టర్ అవనాపు భావన దంపతులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

డెంకాడలో ఉచిత వైద్య శిబిరం



మందులను పంపిణీ చేస్తున్న నాయకులు

డెంకాడ: మండల కేంద్రంలో దాట్ల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో దాట్ల శ్రీకాంత్ బాబు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, డి.ప్రదీప్ రాజు ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 120 మంది రోగులకు వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్లు బి.శ్రీను ఎండి జనరల్, పి.తేజ గైనలజిస్ట్ రోగులను పరీక్షించారు. దాట్ల ఆస్పత్రి ఫౌండర్ చైర్మన్ దాట్ల సత్యనారాయణ రాజు చిట్టిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ఆసుపత్రులలో ఫుల్ బాడీ చెకప్ రూ.1500కే చేస్తామని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరికి అప్పారావు, కెవిఎన్ రంగరాజు, డి.విజయరామరాజు, బుజ్జి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓ బాట 'సారీ'

- ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్లు
- పట్టించుకోని పాలకులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

'నేనో గుంతని నన్ను చూసుకొని వెల్లండి లేదంటే మీ ప్రాణాలు పోతే నాకు సంబంధం లేదు' అన్నట్లు ఉన్నాయి చీపురుపల్లి, గరివిడి పట్టణాలలో రోడ్ల పరిస్థితి. అడుగుకో గుంత ప్రమాదాల చెంత అన్న చందంగా ఉంది చీపురుపల్లి, గరివిడి మేజర్ పంచాయతీలలో ఉన్న రోడ్ల దుస్థితి. ఎన్నికల ముందు పాల రాయివంటి రోడ్లు వేసి ప్రజల ప్రాణాలను కాపాడుతాం అని చెప్పి ఊదర గొట్టి ఉపన్యాసాలు ఇచ్చిన కూటమి పాలకులు తీరా గెలిచిన తరువాత రోడ్లు ఎలా ఉంటే మాకేంటి మేము కారులలో కదా వెల్లేది..మాకేం ప్రమాదం జరగదు కదా.. పోతే ప్రజల ప్రాణాలే కదా పోయేది అని అనుకుంటున్నారో ఏమో తెలియదు గానీ చీపురుపల్లి, గరివిడి మేజర్ పంచాయతీలలో ఉన్న ఏ రోడ్డు కూడా సరిగా లేదు కదా అంతా గుంతల మయమయ్యాయి.

మేజర్ పంచాయతీల పరిధిలో నరక ప్రాయంగా మారిన రహదారులపై ప్రమాదం అంచున ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు, నడక ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఈ మేజర్ పంచాయతీలలో రోడ్లన్నీ పాడై గుంతలు పడడం, రవాణా సమస్యలు తీవ్రంగా ఎదురవడంతో ప్రజలు ఆ రోడ్లు గుండా ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే హడావిడి చేసిన అధికారులు ఆ తరువాత గుంతలు పడిన రోడ్లకి కనీసం మరమ్మత్తు చేయడానికైనా కృషి చేయడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని గాంధీ బొమ్మ జంక్షన్ నుండి పోలీస్ స్టేషన్, రైల్వే స్టేషన్‌కి వెల్లే దారి గత కొంత కాలంగా గుంతలమయమై పూర్తిగా పాడైంది. అటు నుంచి వాహనాలతో పాటు రైలు ప్రయాణీకులు, అడ్డూరి వీధి, శెగిడి వీధులలలో నివాశముంటున్న ప్రజలు రోడ్డు సరిగా లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం అధికారులు, పాలకుల దృష్టికి స్థానిక ప్రజలు ఎన్ని దఫాలు తీసుకెల్లినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గరివిడి నుండి గర్భాం వెల్లే రోడ్డు

పోలీస్ స్టేషన్ మరియు రైల్వే స్టేషన్‌కి వెల్లే రోడ్డు

గరివిడి మేజర్ పంచాయతీలో పాత గరివిడి, బద్రిప్రసాద్ కాలనీ, రైల్వే గేటు నుండి సర్వీసు రోడ్డు, గరివిడి నుండి పాత గరివిడి మీదుగా గర్భాం వెల్లే రోడ్లు పూర్తిగా పాడై పెద్ద పెద్ద గుంతలుగా మారాయి. ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలంటే నరక యాతన పడాల్సి వస్తోంది. రోడ్డు మరమ్మత్తులు కూడా చేయడం లేదని అధికారులు, పాలకులపై ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మరమ్మత్తులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.



సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, యాజమాన్యం

ఫోర్ట్‌సిటీలో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఫోర్ట్‌సిటీ పాఠశాలలో శనివారం దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు దీపావళి ప్రత్యేకతను తెలియజేసే విధంగా నృత్యాలు, కోలాటం ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ కెవి.పి.రాజు మాట్లాడుతూ దీపావళిని గ్రీన్ దీపావళిగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్‌చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్ నీలిమ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో దీపావళి

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాంలో శనివారం అంగన్వాడి టీచర్ కనకదుర్గ ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి పండగను కాలుష్య రహిత వాతావరణంలో నిర్వహించేందుకు పిల్లలు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే క్రీడలు

ప్రజాశక్తి - కొత్తవలస

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకే క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని స్పోర్ట్స్ మండల కన్వీనర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని ప్రగతి వ్యాయామ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్ర, శనివారం రెండు రోజులపాటు నిర్వహించిన క్రీడా ఎంపిక పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న బాల బాలికలలో క్రీడా ప్రతిభను వెలికి తీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లే ఆలోచనతో ప్రభుత్వం పాఠశాల స్థాయిలో అండర్ 14, అండర్ 17 విభాగాలలో పోటీలు నిర్వహించిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్‌జిఎన్ కుమార్, మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల పీడీలు, పిఇటిలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: లక్కవరపుకోట మండల కేంద్రంలోని ఎపి మోడల్ స్కూల్లో శనివారం మండల స్థాయి బాలికల ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు రసవత్తరంగా నిర్వహించామని ఎంఇఒ జి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీల్లో ఏడు పాఠశాలలుకు చెందిన 110 మంది బాలికలు పాల్గొని తలబడ్డారన్నారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ పోలుపర్తి వెంకట్రావు, క్రీడా ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ పోటీలు రసవత్తరంగా జరిగాయన్నారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు త్వరలో జరగబోవు విజయ నగరం డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ పోటీలకు జి.శ్రీనివా సరావు, గాడి రవికుమార్, వి.వెంకటరమణ, జానపరెడ్డి సూరిదేవుడమ్మ, జయలక్ష్మిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని చెప్పారు.

కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

క్రీడాలతో ఉజ్వల భవిష్యత్

బొబ్బిలి: క్రీడాలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. స్థానిక పాత చక్కెర పరిశ్రమ సమీపంలో ఉన్న వీరబొబ్బిలి క్రీడా మైదానంలో శనివారం చిల్డ్రన్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మంచి భవిష్యత్ ఉందని, చిన్నప్పటి నుంచి క్రీడాలపై ఆసక్తి చూపాలన్నారు. విద్యార్థులకు 50, 100, 400 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 21మంది విద్యార్థులను విజేతలగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ రావు శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పిపిపి పెద్ద కుట్ర : బెల్లాన

ప్రజాశక్తి - చీపురుపల్లి

రాష్ట్రంలో ఉన్న పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని తీసుకొస్తోందని ఇది పెద్ద కుట్ర అని మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని, ఇప్పుడు వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే చూస్తూ ఊరుకోమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గిరిడి రామదాసు, ముల్లు పైడిరాజు, కొసిరెడ్డి రమణ, మీసాల సాయి, బూరాడ మహేష్, తలచిట్ల రాము, కర్ణపు ఆదినారాయణ, ఇజ్జరోతు రమణ, సువ్వాడ అప్పలనాయుడు, సతివాడ అప్పారావు, సతివాడ ఆదికృష్ణ, మీసాల గౌరి, రాజేష్, డబ్బాడ జగదీష్, రమేష్, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో శనివారం వైద్య కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఎం జగ్గయ్య బాబు, ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, వేపాడ గ్రామ సర్పంచ్ ఎం అర్జునమ్మ, ఎంపిటిసి గంగతల్లి, వల్లంపూడి సర్పంచ్, ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - చీపురుపల్లి

'మాకు న్యాయం చేయండి.. మా కుమారుడు హత్యకు గురై పది రోజులవుతున్నా ఇంత వరకు పోలీసులు మా గ్రామానికి వచ్చి కనీసం విచారణ కూడా చేయలేదు.. హత్య చేసిన సన్యాసిరావుకి నేర చరిత్ర ఉంది.. అతనికి చీపురుపల్లి ఎస్ బందువు కావడం వల్లనే మాకు అన్యాయం చేస్తురు' పత్తికాయవలస గ్రామానికి చెందిన మృతుడు యలకల రాము కుటుంబీకులు ఆరోపించారు. శనివారం వారు చీపురుపల్లి ప్రెస్ క్లబ్‌లో తమ గోడును విలేకరులకు వివరించారు. ఈ నెల 9న తన కుమారుడు యలకల రాముని ప్రొక్లెయినర్ వానర్ వండాన సన్యాసిరావే హత్య చేసాడని తాము చీపురుపల్లి ఎస్ఐకి ఎన్నిసార్లు మొత్తుకున్నా కనీసం తమ గ్రామంలో విచారణ కూడా చేయలేదని మృతుని తల్లిదండ్రులు యలకల రమేష్, సింహాచలం, చెల్లెలు రమ, మేనమామలు ముగిది పైడితల్లి, పైడిరాజు, మేనత్తలు రాధ, సత్యవతిలు ఆరోపించారు. తాము నేరుగా చీపురుపల్లి స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినప్పటికీ ఇంత వరకు ఎందుకు హత్య చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. హత్య చేసిన సన్యాసిరావుకి ఎస్ఐ బంధువు కావడం వల్లనే తమకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. తమ కుమారుడి హత్యకు కారకుడైన సన్యాసిరావుపై చర్యలు తీసుకోకపోతే ఎస్‌పిని కలుస్తామని హెచ్చరించారు.

చెకుముకి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన

ప్రజాశక్తి- బొబ్బిలి

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. పట్టణంలోని గురుకుల పాఠశాల, శ్రీచైతన్య విద్యా నికేతన్ పాఠశాలలో జెవివి జిల్లా గౌరవ అధ్యక్షుడు కె. శివానంద్, జిల్లా ఉపాధ్యక్షులు పోల సత్యంనాయుడు, ప్రిన్సిపాల్ రఘునాథ్ గురుకుల పాఠశాలలో పేపర్లను ఆవిష్కరించారు. బొబ్బిలి మండలంలో 11 హైస్కూల్సలో 662 మంది విద్యార్థులు ఈ టెస్ట్ రాశారు.పెంట ప్రధానోపాధ్యాయులు ముట్నూరు వేణు పాఠశాలలో 160 మంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో 6 ప్రభుత్వ పాఠశాలల నుండి 555 మంది, 8 ప్రైవేటు హైస్కూల్సు నుండి 857 మంది పాల్గొన్నారు. నియోజకవర్గంలో రామభద్రపురం 6 హైస్కూల్స్ నుండి 362 మంది పాల్గొన్నారు. 147 మంది అత్యధికంగా రామచంద్రపురం హైస్కూల్ నుండి పాల్గొన్నారు. తెర్లాం మండలం జెవివి నాయకులు చప్ప నాగేశ్వరరావు, డాక్టర్ రమేష్, చంద్రమౌళి ఆధ్వర్యంలో 10 హైస్కూల్సు నుండి 857 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాడంగి మండలం జెవివి నాయకులు నల్ల అజయ్‌కుమార్, మత్స రామ కృష్ణ ఆధ్వర్యంలో 6 హైస్కూల్సు నుండి 425 మంది పాల్గొన్నారు. బొబ్బిలి నియోజక వర్గం మొత్తం 3781 మంది పాల్గొన్నారు. నవంబరు 1వతేదీన మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12,13,14 తేదీలలో జరుగుతాయని తెలిపారు.

పాఠశాలల్లో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

కొత్తవలస: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఆ సంస్థ మండల కన్వీనర్ ఎల్ సత్యారావు జిల్లా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యారావు మాట్లాడుతూ సైన్స్ పట్ల అవగాహన, శాస్త్రీయ దృక్పథం, సైన్స్ టెంపర్మెంట్, మూఢ నమ్మకాలను, పర్యావరణం పరిరక్షణ, వాతావారణం కాలుష్యం, క్రియేటివిటీ వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన పెంచడంలో ఈ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పరీక్షల్లో 650 మంది విద్యార్థులు హాజరయ్యారని పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు మండల స్థాయిలో నవంబర్ 1వ తేదీన పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒపి జిందాల్ ప్రిన్సిపాల్ పివిఎస్ఎస్ విశ్వనాధం, బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్‌విఎస్ లక్ష్మి, వియ్యం పేట, కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు గోవిందరాజులు, ఈశ్వరరావు, అమరావతి ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ విజయకుమారి, సూర్యోదయ డిఫెన్స్ కాన్సెప్ట్ పాఠశాల ప్రిన్సిపాల్ గణేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

సారిపల్లి అభివృద్ధికి సహకారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి భోరోసా ఇచ్చారు. శనివారం సాయంత్రం ఆమె మన ప్రజలతో మన ఎమ్మెల్యే కార్యక్రమం సారిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తారక రామ ప్రాజెక్టు వల్ల గ్రామం తీవ్రంగా నష్టపోయిందని ఆర్ఆర్ ప్యాకేజి, గట్టు డిజైన్ మార్చాలని ఎమ్మెల్యేను గ్రామస్థులు కోరారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పింఛన్లు అమలులో ఇబ్బందులు, రోడ్లు, మురుగు వ్యవస్థ వంటి అంశాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి తారక రామ ప్రాజెక్టు సమస్య సిఎం, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. పథకాలు, మౌలిక వసతులపై సంబంధిత అధికార్లతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బి. ఆదినారాయణ మాస్టర్, సారిపల్లి బాబు రావు, కలిశెట్టి సీతారాం, జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, మజ్జి రామారావు, పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సాగుభూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆగూరు పంచాయతీ పరిధిలోని పనుకువానివలస, కిందగూడెం, ఎర్రవానివలస గ్రామాల్లో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాకోటి రాములు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనులు గత 30 ఏళ్లుగా కొండ పోరంబోకు భూములు, పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నార. వారు సాగు చేస్తున్న భూముల్లో పట్టాలివ్వాలని తహశీల్దార్‌కు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

బిందు సేద్యంపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తిలో శనివారం మండల ప్రత్యేక అధికారి పిఎన్‌వి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రైతులకు బిందుసేద్యంపై అవగాహన కల్పించారు. ముందుగా క్షేత్రస్థాయి పంటలను పరిశీలించారు. బిందు సేద్యం వ్యవసాయ పరికరాలకు ఎకరాలోపు ఉన్న షెడ్యూల్ కులాల వారికి 100శాతం రాయితీ ఇస్తారన్నారు. మిగిలి వారికి ఐదు ఎకరాలలోపు ఉంటే 90 శాతం రాయితీ ఇస్తామని అన్నారు. అనంతరం వివిధ రకాల పరికరాలపై పొందే రాయితీ వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎ పవన్ రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబు, కమిషనర్ రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలు నాటి సంరక్షణ చేయాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుతామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు ప్రతిజ్ఞ చేశారు.

వంగర: మానవ మనుగడకు మొక్కలు ఎంతో దోహదపడతాయని ఎంపిడిఒ టి.రాజారావు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిన్నింటి రామారావు, డిప్యూటీ ఎంపిడిఒ కెల్ల రామారావు ఎఒ టి.కన్నబాబు, అధికారులు పాల్గొన్నారు.

మెంటాడ: పల్లె సీమలు, పట్టణాలు స్వచ్ఛంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఎంపిడిఒ భానుమూర్తి అన్నారు. శనివారం మెంటాడ మండల పరిషత్ ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించి ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.కృష్ణ ఎపిఎం అన్నపూర్ణ కార్యాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద క్లీన్ ఎయిర్ (స్వచ్ఛమైన గాలి) అనే అంశంపై అవగాహన కల్పిస్తు ర్యాలీ చేశారు. ఎంపిడిఒ స్వరూపారాణి ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని ప్రతిజ్ఞ చేసి సైకిల్ ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమ్మూరు సుభోసనరావు, ఆళ్ల ఉదయ బాబు, ఇఒపిఆర్‌డి గాయత్రి, పంచాయతీ ఇఒ జయమ్మ, బొల్లు త్రినాథ్, పల్లంట్ల జగదీష్, పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో 'స్వచ్ఛమైన గాలి" అనే అంశపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి వల్లంపూడి గ్రామ సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.బాల భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని జొన్నాడలో గాలి కాలుష్యంపై అవగాహన కల్పించి సైకిల్ ర్యాలీ నిర్వహించి, ఎంపిపి స్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ, ఎంపిటిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి. అప్పలరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ సునీత, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్, సర్వేయర్ పున్నయ్య, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక సామాజిక ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.తిరుమల దేవి ఆధ్వర్యంలో నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నగర పంచాయతీలో మొయిద జంక్షన్, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. థామస్ పేట పుట్‌బాల్ గ్రౌండ్‌లో శ్రమదానం చేసి, మానవహారం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ టి.జయరాం, నాయకులు లెంక అప్పలనాయుడు, జానా ప్రసాద్, మజ్జి ఆదినారాయణ, ముడిమంచి లక్ష్మణరావు, బంగారు శంకర రావు, మెప్మా సిఎంఎం గేదేల రాము, మెప్మా, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

రేగిడి: ఎంపిడిఒ శ్యామలకుమారి, సుగర్స్ హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సిహెచ్ పద్మ ఆధ్వర్యంలో సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శనివారం స్థానిక సర్పంచ్ బుడుమూరు పట్టాభితో కలిసి స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యమైన జీవనం అనే అంశం పై ప్రతిజ్ఞ, మానవహారం, ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వి.జగన్నాథరావు, ఎంఇఒ ఎరకయ్య, ఎఒ శ్రీనివాస్, జెఇ జి.శ్రీచరణ్, ప్యారీస్ షుగర్స్ యాజమాన్యం వీరబాబు, హరివర్మ, పాల్గొన్నారు.

చీపురుపల్లి: స్వచ్ఛాంధ్రకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని ఎంపిడిఒ సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కర్లాం గ్రామంలో వైసిపి నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడుతో కలసి ఆయన సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలనా అధికారి తామరాపల్లి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ బాణాన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బాణాన రామకృష్ణ, మాజీ ఎంపిటిసి కెల్ల రామారావు పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలోని ఎం.రావివలస గ్రామంలో ఎంపిడిఒ జి.బాస్కరరావు ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రతిజ్ఞ, మానవహారం చేపట్టి స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ఉపాధి హామీ జెఇ నరేంద్రకుమార్, సిహెచ్ఒ ఆర్.రామారావు, హౌసింగ్ ఎఇ మురళీ, సచివాలయ, ఆరోగ్య, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో శనివారం శ్రీకాకుళంకు చెందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ ఆధ్వర్యంలో స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా వన్డే మాసివ్ క్లీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ బాలురు, బాలికల కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సహాయంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఎన్ఎస్ఎస్ డైరెక్టరేట్ హైదరాబాద్‌కు చెందిన ఎన్. సంజీవయ్య, ఆర్‌టిసి ఉద్యోగులు, మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి స్వప్న హైందవి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డి.రామారావు, వి. జనార్ధన రావు, స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తసాయి ప్రశాంత్ కుమార్, సామాజిక సేవకుడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత పింక్ చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు-జివి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ఆర్.రాజేశ్వరరావు ఆధ్వర్యాన మొక్కలు నాటారు.

గురజాడ పాఠశాలలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ బి.బి.సరిత, ఎఇ జి.శర్వాణి ఆధ్వర్యాన విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.వి.ఆర్.కృష్ణాజీ, హెచ్‌ఎం పూడి శేఖర్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతి ఒక్కరు నిర్వహించాలి

విజయనగరంకోట : ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులతో ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ టి.వి.గిరి, పాల్గొన్నారు.

కంటోన్మెంట్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో డిఎంహెచ్ఒ ఎస్.జీవన్ రాణి ఆధ్వర్యాన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్.సూర్యనారాయణ, డిఎస్ఒ సత్యనారాయణ, డెమో వి.చిన్నతల్లి పాల్గొన్నారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

F.C.O.P. 1143/2024

బిట్వీన్
శ్రీమతి మండల శారద ...పిటీషనర్
అండ్
శ్రీ మండల రామారావు ...రెస్పాండెంట్

నోటీసు

టు
రెస్పాండెంటు:
శ్రీ మండల రామారావు, S/o. రామప్పడు హిందు, వయస్సు: 39 సం॥లు, (లారీ డ్రైవర్) నివాసం: డోర్ నెం. 35, యస్.సి. కాలనీ, గొల్లలములగాం, చీపురుపల్లి, విజయనగరం జిల్లా.

పైనెంబరు పిటీషన్‌లో పై తెలిపిన పిటీషనర్‌గారు మీపై విడాకుల కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ నందు కోర్టు ద్వారా పంపిన నోటీసులు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది. 23-10-2025**న వాయిదా అయివున్నది. ఆ దినమున మీరు ఉ॥గం॥**10.30**ని॥లకు స్వయంగాగానీ, వకీలు గారి ద్వారాగాని పై తెలిపిన శ్రీ కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పై పిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మాణించెదరని ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

U. HEMALATHA, Advocate
Visakhapatnam. **Cell: 99126 68461**